# ప్రశ్నలు & సమాధానాలు

## ప్రశ్న 354, ఆధ్యాత్మిక పురోగతి
## ఏప్రిల్ 10, 2025

ఈ ఉద్ధరణ ప్రొ. అనిల్ కుమార్ గారి రచన, *Seeking Within,* పేజీలు *142-147* నుండి తీసికొనబడినవి.

ప్రొ. అనిల్ కుమార్ గారు భగవాన్ బాబా వారి సందేశము, ఉపదేశములను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పడానికి ఎంపిక చేయబడ్డారు. భారత దేశంలోను, ఇతర దేశాలలోను కూడా విస్తారముగా తిరిగి ఎంతో మంది భక్తులు అడిగిన ప్రశ్నలు, సందేహాలు స్వామి చెప్పిన వాక్కులు, ఉపన్యాసాలను మూలంగా తీసుకొని తేటతెల్లం చేసారు. ముఖ్యంగా ప్రొ. అనిల్ కుమార్ గారు మన సర్వాంతర్యామి సాయిని ఎలా చేరుకోవాలో మార్గం చూపుతారు.

ప్ర: శరణాగతి అనేది భగవంతుని అనుగ్రహంతోనే జరుగుతుందా**?**

జ. ప్రొ. అనిల్ కుమార్**:** శరణాగతి అనేది ఎప్పుడూ పరిపూర్ణమైనదే. అసంపూర్ణమైనది కానేరదు. భగవంతుని అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. మన కర్తవ్యం ఆ అనుగ్రహం ఉందని గమనించడము. తలుపు కొడితే తెరుచుకొంటుంది. అడిగితే సహాయం దొరుకుతుంది. ప్రకాశం అంతటా ఉంటుంది, కానీ కిటికీ తెరవడం నా కర్తవ్యం.

శరణాగతి అనగా జీవితమనే ప్రవాహాన్ని వ్యతిరేకించకుండా లొంగిపోవడమనే జ్ఞానం. శరణాగతి అనగా బేషరతుగా ఈ ప్రస్తుత క్షణాన్ని నిరసన లేకుండా అంగీకరించడం. అంటే మీ పరిస్థితులు ఎలా ఉన్నా ఏ చర్యలూ లేకుండా ఊరికే ఉండడం కాదు. మీరు చేయవలసిన కర్మలు, ఏర్పాట్లు మానివేయడం కాదు.

నీరు, మంచి భూమి ఉంటే పూవులు అవే పూస్తాయి. దానికి శ్రమ పడక్కరలేదు. ప్రేమ అనే నీరు, భక్తిశ్రద్ధలనే భూమి ఉన్నప్పుడు శరణాగతి అనే పుష్పం అదే పూస్తుంది. అది జరిగే క్రమపద్ధతి, మనము చేయ వలసిన పని కాదు. తోట పూవు పూసే ముందు ప్రకటన చేయదు. కాలం, పరిస్థితులు సరి అయినప్పుడు పూలు అవే పూస్తాయి. భక్తిశ్రద్ధలు మన హృదయం అనే భూమిలో కలిగితే శరణాగతి అనే పుష్పం దానికి అదే వికసిస్తుంది.

ప్ర: మనలో ఉన్న చీకటిని అధిగమించాలంటే దానిని స్వీకరించాలా**?**

జ. ప్రొ. అనిల్ కుమార్**:** మీరు తగినంత కాలం బ్రతికితే తరచూ తప్పులు జరుగుతాయని గమనించవచ్చు. ఆ దుఃఖమును తొలగించాలంటే ఇటువంటి సమయాలలో శరణాగతిని సాధన చేయాలి.

మీరు ఒప్పుకున్నా లేకున్నా ద్వైతం ఉన్నది. మనం ఒప్పుకున్నా లేకున్నా రాత్రి, పగలు ఉన్నాయి. జరిగే ప్రతీదీ భగవంతుని సంకల్పమే అని, అంతా మన మంచి కొరకే, మన జ్ఞానాభివృద్ధి కొరకే జరుగుతున్నదని గుర్తిస్తే మనలో ఉన్న చీకటిని అధిగమించవచ్చు. జీవితంలో కలిగే మంచి చెడ్డలు మన మంచి కొరకే దారితీస్తాయి. కష్టాల వల్ల కొందరు ఇక్కడికి రావచ్చు. కష్టం చెడ్డగా కనిపించవచ్చు కానీ దాని వల్ల మీరు బాబా వారి పాదాల చెంత చేరారు. అది మంచిది. కనుక మీరు పడిన కష్టాలు చివరికి మంచివే. మన జీవిత

పరిస్థితులలో జ్ఞానం ఉపయోగించి వర్తించుకుంటే అంతా భగవంతుని సంకల్పమే, అన్నీ మన మంచి కొరకే అని అర్థం చేసుకోవచ్చు.

శరణాగతి వల్ల జగత్తులో ఆధ్యాత్మిక శక్తి ప్రవేశిస్తుంది. అది నీకు గానీ ఇతరులకు గానీ కష్టాలు కల్పించదు.

**ప్ర: ఒక ఇంటర్వ్యూలో ఒక గురువు ఆధ్యాత్మిక పరిణామంలో 75% భాగం ఆత్మ విచారణ, అనగా మనలో ఉన్న చీకటి, వెలుగు, రెండింటినీ పరిశీలించడం అని చెప్పారు. కానీ కొంత మంది "నేను చీకటిని చూడను. నాలో ఉన్న వెలుగును మాత్రమే చూస్తాను!" అంటారు. దీని గురించి మాట్లాడగలరా?**

**జ. ప్రొ. అనిల్ కుమార్:** ఓహో స్నేహితులారా! మీరందరూ ఈ ప్రశ్నను అర్థం చేసుకునే ఉంటారు. ఇది పరివర్తనకి సంబంధించిన ప్రశ్న. ఇది పరిణామానికి సంబంధించిన ప్రశ్న. ఇది దీర్ఘ ప్రయాణానికి సంబంధించిన ప్రశ్న. మన ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక దశలో పులకరించిపోతాం. ఇంకొంత దూరం పోయాక ప్రకృతి యొక్క అద్భుతాలు చూసి ఆశ్చర్యపడతాం. మరి కొంత దూరం పోయాక ఆత్మ, అనగా విశ్వచైతన్యమును అనుభవించినప్పుడు ఉత్తేజితులౌతాం.

ఇంకా దూరం పొతే ఇంకెక్కడికీ వెళ్ళవలసిన అవసరం లేదు అని అర్థం అవుతుంది. ఎక్కడికీ చేరుకోనక్కరలేదు. ఏమీ సంపాదించక్కరలేదు. ఏదీ కొనసాగించక్కరలేదు. నేను నేనే. నేను ఇక్కడ చేరిపోయాను.

కొంతమంది అనవచ్చు, "నాకు అలాంటి ప్రయాణం వద్దు. నేను ఆయనను ప్రేమిస్తాను. అంతే చాలు." మంచిదే. నీకక్కర లేక పోవచ్చు, కానీ నీవు వద్దనుకున్నా 'అహం బ్రహ్మాస్మి', నీ ఆధ్యాత్మిక ప్రయాణం అక్కడికి చేరుస్తుంది.

ఒక చిన్న ఉదాహరణ: నువ్వు ఒక రైలులో కూర్చున్నావు. అది వేగంగా పరిగెడుతుంది. "నాకిది వద్దు," అనడానికి లేదు. రైలు ఆగితే దిగవచ్చు. వద్దు అనే ప్రశ్న లేదు. మీ ఆధ్యాత్మిక పురోగతిలో పై పై దశలకు వెళ్ళవలసిందే.

మనం బాబా వద్దకు మొట్టమొదటి సారిగా వచ్చినప్పుడు మనకి ఏమి నచ్చుతుంది? ఈ ఆశ్రమ క్రమశిక్షణ మనను ఉత్తేజపరుస్తుంది. ఎందుకనగా అది మరి ఎక్కడా కనిపించదు. బయటి ప్రపంచంలో క్రమశిక్షణ ఉండదు, నియమములు ఉండవు. ఇక్కడ ఆ నియమములు, క్రమశిక్షణ చూచినప్పుడు మనను ఉత్తేజపరుస్తుంది.

తరువాత ఏమి నచ్చుతుంది? ఇక్కడి నిశ్శబ్దం! మరెక్కడా ఇటువంటి నిశ్శబ్దం కనిపించదు. బయటి ప్రపంచంలో మనం నిశ్శబ్దంగా ఉండలేము. మనలో మనమే కూడా నిశ్శబ్దంగా ఉండలేము. వేరే వారు నిశ్శబ్దంగా ఉన్నా కూడా భరించలేము. ఆ నిశ్శబ్దాన్ని చెదరగొడతాము. కనుక ఆ నిశ్శబ్దాన్ని అనుభవించినప్పుడు మనను ఉత్తేజపరుస్తుంది.

ఆ తరువాత ఏమి నచ్చుతుంది? భగవాన్ యొక్క దర్శనం. "ఆహా! కనిపించారు!" ఎందుకు ఇటువంటి స్పందన? భగవాన్ యొక్క ప్రతి దర్శనం నన్ను నేనే మరిపింప చేస్తుంది, నేనెక్కడున్నానో మరిపింప

చేస్తుంది, నా కష్టాలు, రోగాలన్నిటినీ మరిపింప చేస్తుంది, నా పరిస్థితులను మరిపింప చేస్తుంది. ఆహా! ఆ తన్మయత్వంలో అన్నీ మరిచిపోతాను. అదే మనను ఉత్తేజపరుస్తుంది.

తరువాత ఏంటి? కొంత సేవ చేద్దాం, కొంత సాధన చేద్దాం. ఇలా మనకి ఏది తృప్తి కలిగిస్తే అది చేస్తాం. ఒక్కరే అయినా, సంస్థలో అయినా, ఉద్యోగంలో అయినా, ధ్యానంలో అయినా, అదే మనను ఉత్తేజపరుస్తుంది. చివరిగా మనం ఆనందంలో ఉన్నాం. మనం ఆ ఆనందం కంటే వేరు కాదు.

ఇవన్నీ వచ్చే స్టేషన్లు. కొన్ని విమానయాత్రలలో ముంబాయి, ఫ్రాంక్ ఫర్ట్, చికాగోలో దిగి ఇంకో విమానం తీసుకోమంటారు. కొన్ని విమానయాత్రలు నేరుగా గమ్యం చేరుస్తాయి. ఈ ఆధ్యాత్మిక ప్రయాణం అనేది గమ్యం చేరడానికి రకరకాల చోట్లలో ఆగి మారవలసి వస్తుంది.

**ప్ర: విద్యార్థులుగా ఉన్నప్పుడు భగవంతుడు, ఆధ్యాత్మికము వంటి విషయాల గురించి ఎన్నో సందేహాలు ఉంటాయి. వాటిని ఎలా పాటించాలో తెలియక తికమక పడతాము. దీనిని అర్థం అయ్యేడట్లు చెప్తారా?**

జ. ప్రొ. అనిల్ కుమార్: హృదయపూర్వకంగా, నమ్మకంతో, సత్య ధర్మములు పాటించే వాళ్ళు ఎవరైనా సరే స్వామి విద్యార్థి అని నా అభిప్రాయం. స్వామి కాలేజీలలో, యూనివర్సిటీలో చదువుకున్నవారు మాత్రమే కాదు. చిత్ర నారాయణన్ కంటే మంచి విద్యార్థి ఎక్కడా దొరకరు. సాయి నాథ్ కంటే మంచి విద్యార్థి ఎక్కడా దొరకరు. ఎక్కడ శ్రద్ధ భక్తి ఉంటాయో, అక్కడ సాయి బాబా ఉంటారు, వాళ్ళు భక్తులు కనుక.

ఆధ్యాత్మికము ఎలా నేర్పించాలంటే, చిన్న పిల్లలకు కథల రూపంలో చెప్తాను. ఉన్నత తరగతులలో విద్యార్థులకు మానవతా విలువలతో విద్య ఎలా నేర్చుకోవాలో చెప్తాను. చిన్న పిల్లవాడికి “రాముడు రావణుడితో యుద్ధం చేసాడు” అని చెప్తాను. అదే ఉన్నత తరగతి విద్యార్థికి “రాముడు సత్యం, రావణుడు దుర్మార్గము, హనుమంతుడు ఉత్సాహం” అని చెప్తాను. ఇక కాలేజీ విద్యార్థికైతే ఎడ్యుకేర్ గురించి నేర్పుతాను.

ఇవి వివిధ స్థాయిలలో చెప్పే మార్గాలు. కాలేజీ విద్యార్థులకి అద్వైతం, బ్రహ్మం, పరబ్రహ్మం, ఆత్మవిద్య, బ్రహ్మవిద్య గురించి చెప్పలేను. ఒక కాలేజీ విద్యార్థికి, ఒక ఇంజనీరింగ్ విద్యార్థికి, ఒక ఉద్యోగస్థుడికి, ఒక వ్యాపారవేత్తకి ఆధ్యాత్మికం అంటే ఏమిటి? ఆత్మవిశ్వాసమే ఆధ్యాత్మికం. ఆత్మతృప్తియే ఆధ్యాత్మికం. ఆత్మత్యాగమే ఆధ్యాత్మికం. ఆత్మసాక్షాత్కారమే ఆధ్యాత్మికం. పనిలో నైపుణ్యమే ఆధ్యాత్మికం.

యువకులకు ఆధ్యాత్మికం అంటే ఏమిటి? కష్టపడి పని చేయడం. కాలేజీ విద్యార్థులకి? చదువు. స్నాతకోత్తర విద్యార్థులకి? పరిశోధన, విజయం, విద్యలో ప్రాశస్త్యం, మానవ సామర్థ్యం, క్రియాశీలత, నాయకత్వం, సాహసం. అది ఆధ్యాత్మికం.

అరవై సంవత్సరాల తర్వాత దేహం అంతగా సహకరించనప్పుడు, మెదడు జ్ఞప్తికి తెచ్చుకోలేనప్పుడు, కళ్ళు సరిగ్గా కనపడక మగ-ఆడ తేడా తెలియనప్పుడు, చెవులలో వినికిడి సరిగ్గా లేనప్పుడు నమస్మరణయే ఆధ్యాత్మికం, ధ్యానమే ఆధ్యాత్మికం.

కనుక నాయనా, మూడు స్థాయిలు ఉన్నాయి. పచ్చి మామిడి పిందె చేదుగా ఉంటుంది. అదే కొంచెం పెద్ద మామిడికాయ అయినప్పుడు పచ్చడి పెట్టుకోవడానికి తగినట్లు పుల్లగా ఉంటుంది. మామిడి పండుగా మారిన

తర్వాత ఎంతో తీయగా ఉంటుంది. అదే మామిడికాయ చేదుగా, పుల్లగా, తీయగా మూడు స్థాయిలు ఉంటాయి.

ఆధ్యాత్మికం కూడా అంతే. చిన్నపిల్లలకి కథలు, నాటకాలు. యువకులకి నాయకత్వం, నైపుణ్యం, విజయం. పెద్దైన తర్వాత ధ్యానం - కర్మ, భక్తి, జ్ఞానం. హరి ఓం!

వచ్చే వారం ప్రొ. అనిల్ కుమార్ గారు మరిన్ని ప్రశ్నలకు జవాబులతో స్ఫూర్తిని కలిగిస్తారు. ధన్యవాదములు.

ఓం సాయి రామ్